సంపుటి :02 సంచిక :292 పేజీలు :07 వెల ₹5

అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

బుధవారం 28, జనవరి 2026

# నయీం అక్రమాస్తుల కేసులో ఈడీ దూకుడు

- బినామీ ఆస్తుల విలువ 11.30 కోట్లు
- నాంపల్లి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు

05

# జాతర తొలి రోజే విషాదం

- జంపన్న వాగులో భక్తుడి గల్లంతు
- మృతదేహాన్ని వెలికితీసిన రెస్క్యూ టీం

05



# అడవి తల్లి పులకించె.. మేడారం మురిసె!

## గద్దెలపైకి చేరిన సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు

నేల తల్లి ఆత్మగౌరవం నినదించింది.. ములుగు అరణ్యం మురిసిపోయింది! అనాదిగా వస్తున్న గిరిజన ఆచారాల సాక్షిగా, లక్షలాది మంది భక్తుల జయజయధ్వానాల మధ్య మేడారం మహాజాతర అంకురార్పణ జరిగింది. సమ్మక్క భర్త పగిడిద్దరాజు పూనుగొండ్ల నుంచి, అల్లుడు గోవిందరాజులు కొండాయి నుంచి కాలినడకన కదిలి రాగా.. కన్నెపల్లి గడప దాటి సారలమ్మ తల్లి గద్దెపైకి చేరింది. డప్పుల దరువులు, పూజారుల నృత్యాలు, భక్తుల పూనకాల మధ్య ముగ్గురు దైవాలు గద్దెలపై కొలువుదీరడంతో అడవిలో ఆధ్యాత్మిక వెల్లువ విరిసింది. ఇప్పుడు అందరి కళ్లు చిలుకలగుట్ట వైపే.. రేపు కుంకుమ భరిణె రూపంలో రానున్న సమ్మక్క తల్లి ఆగమనం కోసం కోట్లాది మంది భక్తకోటి ఆత్రుతగా వేచి చూస్తోంది.

- అక్షరదర్బార్, మేడారం

అట్టహాసంగా ప్రారంభమైన తెలంగాణ కుంభమేళా | వనదేవతల రాకతో మేడారం జనసంద్రం.. | కిటకిటలాడుతున్న జంపన్నవాగు

02




03

# నామినేషన్ల సందడి

- మున్సిపల్ ఎన్నికల్లో తొలిప్రక్రియ షురూ
- పరిమిత సంఖ్యలో నామినేషన్లు దాఖలు
- ఉమ్మడి జిల్లాలోని 12 బల్దియాల్లో ఎన్నికల కోలాహలం

# సొంత గూటికి అరూరి



- గులాబీ తీర్థం పుచ్చుకున్న మాజీ ఎమ్మెల్యే రమేష్
- తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లోకి చేరిక

05










## గద్దెలపై కొలువుదీరిన

# కన్నెపల్లి వెన్నెలమ్మ

- అట్టహాసంగా ప్రారంభమైన మహాజాతర
- కన్నెపల్లి నుంచి గద్దెలపైకి చేరిన సారలమ్మ
- పగిడిద్దరాజు, గోవిందరాజులు కూడా..
- ముగురు వనదేవతల చేరికతో మహాజాతర షురూ
- అడవితల్లి ఒడిలో అద్భుత ఘట్టం
- తొలిరోజు పోటెత్తిన భక్తులు..
- గద్దెల ప్రాంగణం కిటకిట
- రేపు చిలుకలగుట్ట నుంచి సమ్మక్క రాక..

**అక్షరదర్బార్, మేడారం:**

తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క మహాజాతర బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. అడవి బిడ్డల ఆరాధ్య దైవాలు గద్దెనెక్కే వేళ ములుగు అడవులు భక్తిపారవశ్యంలో మునిగిపోయాయి. నాలుగు రోజుల పాటు సాగే ఈ గిరిజన కుంభమేళాకు తొలిరోజు అంకురార్పణ జరిగింది. మహబూబాబాద్ జిల్లా పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజును గిరిజన పూజారులు కాలినడకన మేడారానికి తీసుకువచ్చారు. కొండాయి నుంచి గోవిందరాజును మేడారం గద్దెల వద్దకు చేర్చారు. ఈ ముగ్గురు దైవాలు బుధవారం సాయంత్రానికి గద్దెలపై కొలువుదీరారు. అలాగే సారలమ్మ కూడా గద్దెలపై కొలువుదీరింది. ముగ్గురు వన దేవతల ప్రతిష్ఠతో మహాజాతర అధికారికంగా ఆరంభమైందని పూజారులు అధికారికంగా ప్రకటించారు.

### - మిగతా మూడురోజుల వేడుకలు ఇలా..

రెండవ రోజు గురువారం గిరిజన పూజారులు చిలుకల గుట్టలోని కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్కను తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్ఠిస్తారు. ప్రభుత్వం తరఫున ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ గాల్లో కాల్పులు జరిపి వన దేవతను ప్రభుత్వ లాంఛనాలతో స్వాగతం పలుకనున్నారు. వన దేవతను గద్దెలపై ప్రతిష్ఠించే సమయంలో భక్తులు పూనకంతో ఊగిపోతారు. మూడోరోజు శుక్రవారం అమ్మవార్లు సమ్మక్క, సారక్క ఇద్దరూ గద్దెలపై కొలువుతీరి భక్తులకు దర్శనమిస్తారు. నాలుగవ రోజు శనివారం సాయంత్రం వారికి ఆవాహన పలికి తిరిగి వనప్రవేశం చేయిస్తారు. ఈ పూజలను వంశపారంపర్యంగా గిరిజన పూజారులే నిర్వహిస్తారు. అమ్మవార్లకు బంగారంగా బెల్లాన్ని సమర్పించుకోవడం ఇక్కడి ప్రత్యేక ఆచారం.

### - పక్కాగా ఏర్పాట్లు

మేడారం జాతరకు ఒక్క తెలంగాణ నుంచే కాక పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌తోపాటు పలు రాష్ట్రాల నుంచి భక్తులు విచ్చేయనున్నారు. కోట్లాది మంది భక్తులు వన దేవతలైన సమక్కమ సారక్కను దర్శించుకోనున్నారు. వారి త్యాగాలను, గిరిజన సంస్కృతిని సజీవంగా నిలబెడుతోంది. కాకతీయుల కాలం నుంచి ఇప్పటి వరకు మేడారం జాతరకు వచ్చే భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతూనే ఉండటం విశేషం. మహాజాతరలో మొత్తం 21 ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధుల్లో ఉన్నారు. జాతర ప్రాంతాన్ని 8 జోన్లు, 42 సెక్టార్లుగా విభజించారు. సుమారు 42 వేల మంది సిబ్బంది సేవలందిస్తున్నారు. వాహనాల పార్కింగ్ కోసం 1,418 ఎకరాలను సిద్ధం చేశారు. భక్తుల ప్రయాణం కోసం టీజీఎస్ఆర్టీసీ 4,000 ప్రత్యేక బస్సులను నడుపుతోంది. తాగునీరు, వైద్య సదుపాయాలు మెరుగుపరిచారు. మొత్తానికి అడవి తల్లి ఒడి మేడారం జాతరతో పరవశించిపోతోంది. కోయ గిరిజనుల ఆత్మగౌరవ నినాదం దిక్కులు పిక్కటిల్లుతోంది.







# నామినేషన్లు షురూ..

- పరకాల మున్సిపాలిటీలో మొదలైన నామినేషన్ల ప్రక్రియ
- తొలి రోజు 5 నామినేషన్లు

అక్షర దర్బార్,పరకాల: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో పరకాల మున్సిపాలిటీలో బుధవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. బుధ, గురు, శుక్రవారాల్లో నామినేషన్ల ప్రక్రియ కొనసాగనుండగా, మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రత్యేక నామినేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.నామినేషన్ల స్వీకరణ కోసం మొత్తం 7 కౌంటర్లు ఏర్పాటు చేయగా, ప్రతి కౌంటర్‌కు మూడు నామినేషన్లు చొప్పున కేటాయించారు. అయితే ఐదవ కౌంటర్‌కు మాత్రం నాలుగు నామినేషన్లు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. బుధవారం మొదటి రోజు నామినేషన్ల ప్రక్రియ మందకొడిగానే సాగింది. తొలి నామినేషన్‌గా పరకాల 7వ వార్డుకు చెందిన నల్లెల అనిల్ కుమార్ (కాంగ్రెస్), 11 వ వార్డు రాజ భద్రయ్య (బీజేపీ ), 20 వ వార్డు పాలకుర్తి తిరుపతి



(బీజేపీ),16 వ వార్డు వీర్ల శంకర్ (కాంగ్రెస్),18వ వార్డు ఒంటేరు కోమల (స్వతంత్ర),నామినేషన్ల పత్రాలు దాఖలు చేశారు. మొదటి రోజున పరిమిత సంఖ్యలోనే నామినేషన్లు అందాయని అధికారులు వెల్లడించారు.కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల అభ్యర్థులు గురువారం నుంచి పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

## బీఆర్ఎస్ లో చేరిన సీనియర్ నేతలు

అక్షర దర్బార్,పరకాల: పరకాల పట్టణం 1వ వార్డుకు చెందిన సీనియర్ నాయకుడు బండారి సుగుణాకర్, 5వ వార్డుకు చెందిన యాట ప్రశాంత్ బుధవారం భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీలో చేరారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలపై నమ్మకంతోనే తాము తిరిగి సొంత గూటికి చేరినట్లు చేరిన నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పరకాల మున్సిపల్ బీజేపీ కన్వీనర్ గా డా. సిరంగి సంతోష్ కుమార్

అక్షర దర్బార్, పరకాల : పరకాల మున్సిపల్ ఎన్నికల కోసం బీజేపీ డా. సిరంగి సంతోష్ కుమార్‌ను కన్వీనర్‌గా నియమించింది. హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. డా. సంతోష్ కుమార్ ఎన్నికల్లో 22 వార్డులను బీజేపీ కైవసం చేసుకోవడానికి ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాల్సిందని, పార్టీ విజయానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాల్సిన సమయం ఇదేనని తెలిపారు. ఆయనను పరకాల బీజేపీ నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు చందుపట్ల రాజేందర్ రెడ్డి, దేవునూరి మేఘనాథ్, ప్రధాన కార్యదర్శి సంఘ పురుషోత్తం, నాయకుడు బెజ్జంకి పూర్ణ చారి, కుక్కల విజయ్ కుమార్, కొలనుపాక భద్రయ్య, బాగానే సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా ప్రారంభమైన మహాజాతర

అక్షర దర్బార్, మేడారం : అశేష భక్తజన సందోహం నడుమ ములుగు జిల్లా మేడారంలో సమ్మక్క–సారలమ్మ మహాజాతర బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. జాతర తొలి రోజున కన్నెపల్లి నుంచి సారలమ్మ దేవత గద్దెపైకి రాకతో మహాజాతర అంకురార్పణ జరిగింది. బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య సమ్మక్క, సారలమ్మ పూజారులు గద్దెల వద్దకు చేరుకుని పుట్టమన్నుతో గద్దెలను అలికి శుద్ధి చేశారు. అనంతరం ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం గొట్టు గోత్రాల విధానంలో పీఠ ముగ్గులు వేసి అమ్మవార్లకు పసుపు, కుంకుమ, చీర సారెలు సమర్పించి ధూప దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం కన్నెపల్లి నుంచి హనుమంతుని రక్షా కవచం (నీడ)లో సారలమ్మ బయలుదేరి రాత్రి 9 నుంచి 10 గంటల మధ్య మేడారం గద్దెలకు చేరుకున్నారు. ఇదే సమయంలో కొండాయి నుంచి గోవిందరాజులు, పూనుగొండ్ల నుంచి పగిడిద్ద రాజులను పూజారులు గద్దెలపై ప్రతిష్ఠించారు. మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా వెన్నెల వెలుగులో సమ్మక్క అమ్మవార్లకు, పగిడిద్ద రాజులకు ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మేడారం ప్రధాన పూజారి సిద్దబోయిన అరుణ్ కుమార్ మాట్లాడుతూ భక్తులందరూ అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని, ప్రభుత్వం, ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయని తెలిపారు.

## సింగరేణి ల్యాంప్ రూంలో అగ్ని ప్రమాదం

1300 క్యాప్ ల్యాంపులు దగ్ధం



అక్షర దర్బార్, భూపాలపల్లి ప్రతినిధి : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కేటీకే–5వ గనిలో బుధవారం తెల్లవారుజామున ల్యాంప్ రూంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఉదయం సుమారు 3.30 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ జరగడంతో మంటలు చెలరేగి గదిలో నిల్వ ఉంచిన 1300 క్యాప్ ల్యాంపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎవరికీ ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. ఒక్కో క్యాప్ ల్యాంప్ ధర రూ.3,500 నుంచి రూ.4,000 వరకు ఉంటుందని కార్మికులు పేర్కొంటుండగా, మొత్తం మీద సింగరేణి సంస్థకు సుమారు రూ.45 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు.

## ఎల్ఈడీ టీవీ బహూకరణ

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న భవిత (ప్రత్యేక అవసరాల గల పిల్లల వనరుల కేంద్రం)కు పూర్వ విద్యార్థులు ఎల్ఈడీ టీవీని బహుమతిగా అందించారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇదే పాఠశాలలో 1999–2000 బ్యాచ్‌లో చదువుకున్న జెట్టి కుమార్, కొంక అశోక్, పోతుగంటి శ్రీధర్, చిలుముల రాజేందర్‌లు బుధవారం భవిత కేంద్రం పిల్లల సౌకర్యార్థం ఎల్ఈడీ టీవీని అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ కొడెపాక రఘుపతి మాట్లాడుతూ తాము చదువుకున్న పాఠశాల, ఊరి కోసం సేవా దృక్పథంతో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో మేడిపల్లి శ్రీనివాస్, ఐఎఫ్ఆర్పి సంద మహేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాజీపేట రవీందర్, ఉపాధ్యాయులు బండారి సదయ్య, భాస్కర్, వందన, కేర్‌టేకర్ కళావతి, ఫిజియోథెరపిస్ట్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్ట్ జగదీశ్వర్ కు కన్నీటి వీడ్కోలు

అంతిమయాత్రలో పాల్గొన్న జర్నలిస్టులు

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి : సామాజిక, సమకాలీన పోరాటాల్లో తన కలం ద్వారా ప్రజలను చైతన్యపరిచిన సీనియర్ జర్నలిస్ట్ గోగుల జగదీశ్వర్‌కు ప్రజలు, అభిమానులు కన్నీటితో వీడ్కోలు పలికారు. ఆయన ఆకస్మిక మరణం పాత్రికేయ, సాహితీ, సాంస్కృతిక రంగాలకు తీరని లోటని పలువురు జర్నలిస్టులు పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన గోగుల జగదీశ్వర్ గత 45 సంవత్సరాల క్రితం మొగుళ్లపల్లి మండల కేంద్రంలో స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. మొగుళ్లపల్లి మండలంలో తొలి పాత్రికేయుడిగా గుర్తింపు పొందిన ఆయన, ఆంధ్రప్రభ పత్రికలో దాదాపు 40 సంవత్సరాలు ఏకధాటిగా సేవలందించి పాత్రికేయ రంగానికి విశేష సేవలు చేశారు. జగదీశ్వర్ అంతిమ యాత్రలో పలువురు జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, సంఘ నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు. వరంగల్ ఆంధ్రప్రభ బ్యూరో చీఫ్ మెందు రవీందర్, నల్గొండ జిల్లా సాక్షి స్టాఫ్ రిపోర్టర్ చింతకింది గణేష్,



టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర నాయకులు ఓల్లాల వెంకటరమణ, సీనియర్ జర్నలిస్ట్ వేముల సదానందం, టీయూడబ్ల్యూజే (ఐజేయు) భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్, మొగుళ్లపల్లి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కేతరాజు రమేష్, ప్రధాన కార్యదర్శి నిమ్మల సారయ్యతో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయు) భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్ మాట్లాడుతూ.. గోగుల జగదీశ్వర్ తన కలం ద్వారా సమాజంలో మార్పు కోసం చేసిన పోరాటం మరువలేనిదని అన్నారు. ఆయన పాత్రికేయ, సామాజిక సేవలను గుర్తు చేసుకుంటూ త్వరలో మొగుళ్లపల్లి మండల కేంద్రంలో సంతాప సభ నిర్వహించి నివాళులర్పిస్తామని తెలిపారు.

### ఆర్య వైశ్యుల సంఘ నేతల నివాళి..

మొగుళ్లపల్లి మండలానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు, ఆర్య వైశ్య సంఘం గౌరవ నేత గోగుల జగదీశ్వర్ మృతి పట్ల ఆర్య వైశ్యుల సంఘ నేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధవారం జగదీశ్వర్ పార్థివ దేహానికి నివాళులర్పించి ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొగుళ్లపల్లి మండల ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు బెజిగం నాగరాజు, ఉపాధ్యక్షుడు బజ్జూరి వీరన్న, మండల కార్యదర్శి బజ్జూరి వేణుగోపాల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆర్య వైశ్య సంఘం ఉపాధ్యక్షుడు బజ్జూరి రాఘవులు తదితరులు మాట్లాడుతూ పాత్రికేయ రంగంలో విశేష సేవలు అందించిన సీనియర్ జర్నలిస్టు గోగుల జగదీశ్వర్ మరణం మండల ప్రజలకు, ఆర్య వైశ్య సమాజానికి తీరని లోటని అన్నారు.



# మేడారంలో ఏర్పాట్లు భేష్

**తక్కువ సమయంలో దర్శనం..**

**జాతరలో సౌకర్యాలపై భక్తుల హర్షం**

అక్షర దర్బార్, ములుగు ప్రతినిధి : సమ్మక్క–సారలమ్మ మేడారం మహాజాతర సందర్భంగా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం చేపట్టిన ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈసారి మేడారంలో తక్కువ సమయంలో దర్శనం జరుగుతుండగా, భారీ రద్దీ ఉన్నప్పటికీ ఎక్కడా తొక్కిసలాటలు లేకుండా, క్యూ లైన్లలో ఇబ్బందులు లేకుండా దర్శనం సాఫీగా సాగుతోందని భక్తులు పేర్కొన్నారు. మేడారం చేరే రహదారుల్లో వాహనాల రాకపోకలు సులభంగా సాగుతున్నాయని, ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గాయని తెలిపారు. భారీగా భక్తులు తరలివస్తున్నప్పటికీ వైద్య సేవలు, తాగునీటి సౌకర్యాలు, పరిశుభ్రత, భద్రతా చర్యలు సమర్థవంతంగా అమలవుతున్నాయని భక్తులు హర్షం వ్యక్తం చేశారు. మొత్తం మీద భక్తుల సౌకర్యాన్ని ప్రధానంగా తీసుకుని చేపట్టిన ఏర్పాట్లు ప్రశంసనీయమని, అధికారుల సమన్వయంతో ఈసారి మేడారం జాతర ప్రశాంతంగా సాగుతోందని తెలిపారు.



# ఎంజీఎం స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

**అంబేద్కర్ సంఘం డిమాండ్**

అక్షర దర్బార్, చిట్యాల : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజ్యాంగాన్ని అవమానించేలా కార్యక్రమాలు నిర్వహించిన ఘనపూర్ మండలం చిల్పూరు గ్రామంలోని ఎంజీఎం స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ సంఘం నేతలు డిమాండ్ చేశారు. బుధవారం అంబేద్కర్ సంఘం రాష్ట్ర యువజన సంఘం ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య ఆధ్వర్యంలో తహశీల్దార్ ఇమామ్ బాబాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పుల్ల మల్లయ్య మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం రోజున విద్యార్థులకు బోనాలు, బతుకమ్మ, పోతురాజుల వేషాలు వేయించడం ద్వారా భారత రాజ్యాంగాన్ని అవమానించారని ఆరోపించారు. ఇలాంటి చర్యలకు బాధ్యులైన స్కూల్ యాజమాన్యం, సిబ్బందిపై జిల్లా కలెక్టర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా దళిత సంఘాల ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం, ధర్మ సమాజ్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# చిట్యాల మండల మాదిగ జాగృతి సంఘం ఏకగ్రీవ ఎన్నిక

అక్షర దర్బార్, చిట్యాల : మాదిగ జాగృతి సంఘం జిల్లా కోశాధికారి శీలపాక నాగరాజు గారి ఆధ్వర్యంలో చిట్యాల మండల కేంద్రంలో బుధవారం మాదిగ జాగృతి సంఘం చిట్యాల మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా నద్దునూరి రాజ్ కుమార్, ఉపాధ్యక్షులుగా దాసారపు సృజన్ కుమార్, ప్రధాన కార్యదర్శులుగా నేరెళ్ల రమేష్, కండె రమేష్ , కార్యదర్శి గా మట్టేవాడ కుమార్, కోశాధికారిగా రత్న రమేష్, కార్యవర్గ సభ్యుడుగా పర్లపల్లి కుమార్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పుల్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.





# మినీ మేడారాల్లో అన్ని ఏర్పాట్లు

- **ములకలపల్లి- మొగుళ్లపల్లి వనదేవతలను దర్శించుకున్న ఎమ్మెల్యే గండ్ర**



అక్షర దర్బార్, మొగుళ్లపల్లి : ములకలపల్లి, మొగుళ్లపల్లి గ్రామాల వద్ద వెలసిన వనదేవతలను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సమ్మక్క–సారలమ్మ తల్లుల చల్లని దీవెనలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రజల కష్టాలను తొలగిస్తూ కోరిన కోరికలు తీర్చే గిరిజన ఆదివాసీ దైవం సమ్మక్క–సారలమ్మ అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మునుపెన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో జరుగుతున్న అన్ని మినీ మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరలకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అనంతరం జాతరలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్, సీసీ కెమెరాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ రఫీ, మాజీ సర్పంచుల పూర్వ అధ్యక్షుడు చదువు అన్నారెడ్డి, మొగుళ్లపల్లి సర్పంచ్ చాట్ల విజయ రవీందర్, నాయకులు తక్కలపల్లి రాజు, ఆకుతోట కుమారస్వామి, కేతరాజు, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ఆలయ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లిలో గులాబీ జెండా ఎగురవేస్తాం

**డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ,మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి**



అక్షర దర్బార్, భూపాలపల్లి : మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుని భూపాలపల్లిలో గులాబీ జెండా ఎగురవేస్తామని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా కాంగ్రెస్ పాలనలో భూపాలపల్లిలో అభివృద్ధి శూన్యమైందని, ఎన్నికలు దగ్గరపడిన నేపథ్యంలో ప్రజలను బెదిరించడం, శిలాఫలకాల ద్వారా బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ పాలనలోనే భూపాలపల్లి అత్యంత వేగంగా అభివృద్ధి చెందిందని, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ భూపాలపల్లి అర్బన్ కమిటీ అధ్యక్షుడు కటకం జనార్ధన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్యాలెండర్ ఆవిష్కరణ

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి : తెలంగాణ వాణి–2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంచి సమాజ నిర్మాణంలో పత్రికల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రభుత్వం–ప్రజల మధ్య వారధిగా పత్రికలు విశేషంగా దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, సమ్మక్క–సారక్క జాతర కమిటీ ప్రధాన కార్యదర్శి చదువు అన్నారెడ్డి, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండి రఫీ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, జిల్లా నాయకుడు తక్కల్లపల్లి రాజు, మొగుళ్లపల్లి గ్రామ సర్పంచ్ చాట్ల విజయ రవీందర్, ముల్కలపల్లి సర్పంచ్ గాదం శ్రీవాణి, జిల్లా నాయకులు ఎర్రబెల్లి పున్నమి, చందర్, రాము, తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

**శివాజీ నగర్ గ్రామ సర్పంచ్ సుకినే నాగరాజు**

అక్షర దర్బార్, దుగ్గొండి : ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని శివాజీ నగర్ గ్రామ సర్పంచ్ సుకినే నాగరాజు అన్నారు. బుధవారం ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.2.50 లక్షల వ్యయంతో ఫామ్ ఫండ్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగరాజు మాట్లాడుతూ గ్రామంలో అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను చేపట్టాలని, వాటిని పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామస్తులకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామ అభివృద్ధి కూడా సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తిరుమల రావు, రాజు, హరీష్, రమేష్, మనదీప్, రంజిత్, రజిత, సునీత, అనిత, కళ్యాణి, లింగన్న పాల్గొన్నారు.



# స్టిక్కర్ క్యాలెండర్ ఆవిష్కరణ





అక్షర దర్బార్, చిట్యాల : రాష్ట్రోపాధ్యాయ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా శాఖ రూపొందించిన జిల్లా క్యాలెండర్‌ను చిట్యాల మండల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన స్టిక్కర్ క్యాలెండర్లను చిట్యాల మండల విద్యాశాఖ అధికారి శ్రీ కోడేపాక రఘుపతి బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం చిట్యాల మండల శాఖ అధ్యక్షుడు శ్రీ బొమ్మ రాజమౌళి, ప్రధాన కార్యదర్శి దాసారపు రాజయ్య ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీమతి నీలిమా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 5న పార్లమెంట్ ముందు నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.



# ఎడ్లబండిపైనే వనదేవతల సన్నిధికి !

- తరాలు మారినా మారని సాంప్రదాయం

అక్షరదర్బార్, మేడారం : ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర సమ్మక్క–సారలమ్మ చెంతకు కొన్ని జిల్లాల నుంచి భక్తులు ఎడ్ల బండ్లపై పిల్లా జెల్లాతో కలిసి చేరుకున్నారు. ఆధునిక వాహనాలు ఎన్ని ఉన్నా వారు మాత్రం ఎడ్లబండినే నమ్ముకున్నారు. ఇది పూర్వీకుల నుంచి వారసత్వంగా వస్తున్న భక్తి మార్గం. ముందుగా గుడియమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమ, కొబ్బరికాయలతో మొక్కులు చెల్లించారు. బండ్లకు రంగురంగుల పూలు కట్టారు. జెండాలను పాతారు. పిల్లాజెల్లా అంతా బండిపైనే చేరారు. అవసరమైన బియ్యం, పప్పులు, వంట సామాగ్రిని బండిలోనే సర్దుకున్నారు. డప్పు చప్పుళ్ల మధ్య ప్రయాణం సాగుతోంది. అడవి మార్గంలో "జై సమ్మక్క.. జై సారలమ్మ" అనే నినాదాలు మార్మోగుతున్నాయి. చిన్నారుల కేరింతలు ఈ ప్రయాణంలో ప్రత్యేక ఆకర్షణ. పెద్దలు తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్నారు. పచ్చని చెట్ల నీడన బండ్లు సాగిపోతున్నాయి. చీకటి పడితే చెట్ల కిందనే విడిది చేస్తారు. అక్కడే వంట చేసుకుంటారు. అందరూ కలిసి భోజనం చేస్తారు. ఈ ప్రయాణంలో విడదీయలేని ఆత్మీయత కనిపిస్తుంది. ఆధ్యాత్మిక అనుభూతి లభిస్తుంది. సంప్రదాయం మీద ఉన్న గౌరవం ప్రతి అడుగులోనూ ప్రతిబింబిస్తోంది.

# నిరంతరం విద్యుత్ సరఫరా

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి
- మహాజాతరలో విద్యుత్ సరఫరా ఏర్పాట్ల పరిశీలన



అక్షరదర్బార్, మేడారం : జాతరలో విద్యుత్ అంతరాయం కలగకుండా ఎన్పీడీసీఎల్ భారీ ఏర్పాట్లు చేసింది. నాలుగు వేర్వేరు మార్గాల నుంచి ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకున్నట్లు సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. రేడియో ఫ్రీక్వెన్సీ టెక్నాలజీతో 106 ట్రాన్స్‌ఫార్మర్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. దీనివల్ల ఎక్కడైనా సమస్య తలెత్తితే సబ్ స్టేషన్ నుండే తక్షణమే గుర్తించి సరిచేయవచ్చు. జాతర విధుల్లో 600 మంది సిబ్బంది, 55 ప్రత్యేక బృందాలు నిరంతరం పనిచేస్తున్నాయి. సిబ్బంది పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా 70 టెంట్లను ఏర్పాటు చేశారు. అంకితభావంతో పనిచేసి జాతరను విజయవంతం చేయాలని సీఎండీ సిబ్బందిని కోరారు. జాతరను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలని సిబ్బందిని కోరారు. పర్యటనలో డైరెక్టర్లు వీ మోహన్ రావు, టీ మధుసూదన్ , చీఫ్ ఇంజినీర్ రాజు చౌహాన్, సీఈ ఐటి శ్రవణ్ కుమార్ , జీఎం ఐటీ శ్రీనివాస్, ములుగు ఎస్ఈ ఆనందం ఉన్నారు.

# నయీం అక్రమాస్తుల కేసులో ఈడీ దూకుడు

- బినామీ ఆస్తుల విలువ 11.30 కోట్లు
- నాంపల్లి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు

అక్షరదర్బార్, హైదరాబాద్ : గ్యాంగ్‌స్టర్ నయీం అక్రమాస్తుల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కీలక అడుగు వేసింది. మనీలాండరింగ్ ఆరోపణలపై దర్యాప్తు పూర్తి చేసిన అధికారులు నాంపల్లి కోర్టులో బుధవారం ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఈ ఛార్జిషీట్‌ను పరిశీలించిన న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. నయీం తన గ్యాంగ్ సభ్యులతో కలిసి దాదాపు రూ.11.30 కోట్ల విలువైన 35 ఆస్తులను అక్రమంగా సంపాదించినట్లు ఈడీ గుర్తించింది. ఈ అక్రమ ఆస్తుల వ్యవహారంలో నయీం భార్య హసీనా బేగంతో పాటు మొత్తం పది మందిపై అభియోగాలు మోపారు. నయీం సంపాదించిన ఆస్తులన్నీ తన కుటుంబ సభ్యులు, సన్నిహితులు, బినామీల పేర్లపై రిజిస్టర్ అయినట్లు దర్యాప్తు లో తేలింది. వీటిలో యాదాద్రి భువనగిరి జిల్లాలోని షాపింగ్ కాంప్లెక్స్‌లు, వ్యవసాయ భూములు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. గతంలో ఈ ఆస్తులకు సంబంధించి నోటీసులు ఇచ్చినా నిందితులు స్పందించలేదు. ఆదాయపు పన్ను పత్రాలు కూడా సమర్పించకపోవడంతో ఈడీ కఠిన చర్యలకు సిద్ధమైంది. అక్రమంగా ఆర్జించిన ఈ సొమ్ము ఎక్కడికి వెళ్లిందనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. నయీంకు ఉన్న రాజకీయ, పోలీస్ సంబంధాలపై కూడా ఈడీ దృష్టి సారించింది. అక్రమ దందాల్లో అధికారులు, రాజకీయ నాయకుల హస్తం ఉందా అనే కోణంలో కూపీ లాగుతున్నారు. 2016లో నయీం ఎన్‌కౌంటర్‌లో మరణించిన తర్వాత సిట్ దర్యాప్తు చేపట్టి సుమారు 250 కేసులు నమోదు చేసింది. ఇప్పుడు ఈడీ దాఖలు చేసిన ఛార్జిషీట్ ఆధారంగా నిందితులకు కోర్టు త్వరలోనే నోటీసులు జారీ చేసే అవకాశం కనిపిస్తోంది.

# జాతర ట్రాఫిక్ పై సీపీ నజర్




అక్షరదర్బార్, హనుమకొండ: బుధవారం నుంచి ప్రారంభమైన మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా వరంగల్ నగరం నుండి మేడారం గద్దెల వరకు రోడ్డు మార్గంలో కొనసాగే వాహనాల రాకపోకలపై వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పస్రా, తాడ్వాయి, జంక్షన్ల వద్ద ట్రాఫిక్ కొనసాగుతున్న తీరును క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయడంతో పాటు, ఆయా సెక్టార్ అధికారులకు పలు సూచనలు చేస్తున్నారు.

# తొలి రోజే విషాదం

- జంపన్న వాగులో భక్తుడి గల్లంతు
- మృతదేహాన్ని వెలికితీసిన రెస్క్యూ టీం

అక్షరదర్బార్, మేడారం : మహాజాతర ప్రారంభమైన మొదటి రోజు బుధవారమే మేడారంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. జంపన్న వాగులో స్నానం కోసం దిగిన ఓ భక్తుడు నీటి ప్రవాహంలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయాడు. మంచిర్యాల జిల్లాకు చెందిన కిరణ్(45) అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవార్ల దర్శనానికి వచ్చాడు. వాగులో స్నానం ఆచరిస్తున్న సమయంలో అకస్మాత్తుగా నీటిలో గల్లంతయ్యాడు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టాయి. కిరణ్ మృతదేహాన్ని వెలికితీశాయి. కుటుంబ సభ్యుల రోదనలతో ఆ ప్రాంతం కన్నీరు పెట్టించింది.

# నామినేషన్ల సందడి

- మున్సిపల్ ఎన్నికల్లో తొలిప్రక్రియ షురూ
- పరిమిత సంఖ్యలో నామినేషన్లు దాఖలు
- ఉమ్మడి జిల్లాలోని 12 బల్దియాల్లో ఎన్నికల కోలాహలం



అక్షరదర్బార్, వరంగల్: తెలంగాణలో మంగళవారం మున్సిపల్ ఎన్నికల నగారా మోగగా, బుధవారం ఉదయం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో తొలిరోజు పరిమిత సంఖ్యలో అభ్యర్థులు తమ పత్రాలను దాఖలు చేశారు. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జనగామ, నర్సంపేట, పరకాల, మహబూబాబాద్, డోర్నకల్, కేసముద్రం, మరిపెడ, తొర్రూరు, భూపాలపల్లి, వర్ధన్నపేట స్టేషన్ గణపురం, ములుగు మున్సిపాలిటీల్లో కొందరు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఈనెల 30 వరకు నామినేషన్ల ప్రక్రియ సాగనుంది. ఫిబ్రవరి నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఫిబ్రవరి 3వ తేదీ. 11న పోలింగ్ జరుగనుంది. ఇదే నెల 13న ఫలితాలు వెల్లడికానున్నాయి. ఫిబ్రవరి 16న ఆయా మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరగనుంది. ఎన్నికల నోటిఫికేషన్‌తో పట్టణ ప్రాంతాల్లో రాజకీయ సందడి పెరగగా, ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. ఆయా మున్సిపాలిటీలో ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణను జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద వర్ధన్నపేట మున్సిపాలిటీని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

# సొంత గూటికి అరూరి

- గులాబీ తీర్థం పుచ్చుకున్న మాజీ ఎమ్మెల్యే రమేష్
- తెలంగాణ భవన్ లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ లోకి చేరిక

అక్షరదర్బార్, హైదరాబాద్: రాష్ట్ర రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. సోమవారం బీజేపీకి రాజీనామా చేసిన ఆయన, బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో అధికారికంగా బీఆర్ఎస్ పార్టీలో చేరగా, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు.

## - ముఖ్య నేతల సమక్షంలో చేరిక

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అగ్రనేతలు హరీష్ రావు, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కీలక నేతలందరి సమక్షంలో రమేష్ చేరిక జరగడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

## - మున్సిపల్ ఎన్నికల వేళ రాజకీయ సంచలనం

త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల సమయంలో అరూరి రమేష్ తిరిగి బీఆర్ఎస్‌లోకి రావడం ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో సంచలనంగా మారింది. ముఖ్యంగా వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో రమేష్‌కు ఉన్న పట్టు, ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు లాభిస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



క్షేత్రస్థాయిలో బలమైన కేడర్ కలిగిన నేత తిరిగి రావడంతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.






# మేడారం..
# జన గూడారం




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

## ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915